# పాస్ట్

## మినీ కథ

రేపు పొద్దున 10 గంటల కల్లా కొత్త వుద్యోగంలో జాయిన్ అవ్వాలి. మా ఆఫీసర్ ఎలావుంటాడో ఏమిటో... లోపల భయంగా వుంది. నా పక్కన ఎవరో ముసలాయన కూర్చున్నారు. సిటీ బస్సు జోరుగా పోతోంది. మాటలు కలిపారాయన. మాటల్లో టైం గురించి ప్రస్తావన వచ్చింది." ఈ సిటీ బస్సుల్లో గమ్యస్థానం చేరుకోవడం చాల కష్టం. అందుకని నేనెప్పుడూ అరగంట పాస్ట్ పెట్టుకుంటాను. నా 30 ఏళ్ళ సర్వీసులో సిన్సియర్‌గా వుంటున్నానంటే యిలా టైం అరగంట పాస్ట్ పెట్టుకోవడం వల్లనే" అని చెప్పారాయన.

ఆయనమాట వేదవాక్కులా అనిపించింది. ఆయన అభిమానాన్ని సంపాదించుకోవడానికి అప్పటికప్పుడే అరగంట టైం పాస్ట్‌గా పెట్టాను. ఆయన మెచ్చుకుంటూ "భేష్, నాకు నచ్చావు కుర్రాడా! నీ సిన్సియారిటీ యికనుండి పదిమంది మన్ననలనూ పొందుతుంది" అని దీవించి తన స్టాప్ రాగానే దిగిపోయారు

మరునాడు తెల్లవారే లేచి గబగబ స్నానం చేసి, యింట్లోవాళ్ళని కంగారుపెట్టి నేను కంగారుపడిపోయి 8.30 కల్లా బస్‌స్టాపుకి చేరుకొని సరిగ్గా 9-35 కల్లా ఆఫీసుకి చేరుకున్నాను వురుకులు పరుగులతో.

ఆఫీసులోకి యెంటరవ్వగానే ఆఫీసర్‌గారనుకుంటాను, నిప్పులు రువ్వుతున్నారు. ఆయన నన్ను చూడగానే మండిపడుతూ, "బుద్ధిలేదా నీకు? నీకిచ్చిన అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లోని టైమ్‌ని ఖచ్చితంగా పాటించాలనే జ్ఞానం లేదా? మొదటి రోజునే అయిదు నిముషాలు లేటయితే ముందుముందు యింకేం పనిచేస్తావు? హుం, యింకెప్పుడూ యిలా రామాక. వస్తే మెమో పుచ్చుకుంటావు జాగ్రత్త! యింక నడు, అదుగో అమూల చీపురూ, చేటా వున్నాయి. మొత్తం ఆఫీసు రూములన్నీ అరగంటలో తుడిచి నా రూంలోకి వచ్చి నిలబడు" అని ఆర్డర్ జారీచేసి తన రూమ్‌లోకి వెళ్ళిపోయారు.

ఆఫీసు డ్యూటీ 9 గంటలకని నాకు తెలియదు. నిర్ఘాంతపోయాను. యేడుపు వచ్చింది చండశాసనుడిలా వున్నాడీ ఆఫీసరు. నేనేమో గుమాస్తాగా చేరడానికి వచ్చాను. కాస్తంత ఆలస్యంగావస్తేనే యీయన రూములు తుడవమంటున్నాడు. యింకా ఆలస్యంగా వస్తే బాత్రూములు కూడా తుడవమంటాడు కాబోలు అనుకుని వెళ్లగా ఆఫీసు రూములు తుడవడం మొదలు పెట్టాను కాసేపున్నాక వో అతను కంగారుగా వచ్చి నా చేతిలో చీపురు, చేటా లాక్కొని నన్ను బలవంతంగా పక్కకునెట్టి తను వూడ్చటం మొదలు పెట్టాడు. అతనితో మాట్లాడగా తేలిందేమిటంటే అతనికీ ఈ రోజే సరిగ్గా తొమ్మిది గంటలకు తోటీగా వుద్యోగంలో చేరడానికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ యిచ్చారని

ఆఫీసరుగారు నన్నే తోటీ అనుకుని ఆఫీసు రూములు తుడవమన్నట్టు తెలిసింది. వెంటనే వాచీ అరగంటకు తిప్పేశాను. "మిమ్మల్ని పిలుస్తున్నా"రని తోటీ చెప్పగానే తొందరగా ఆఫీసర్‌గారి రూమ్‌లోకి వెళ్ళాను

"యేమయ్యా, నేను గుమస్తాగా చేరడానికి వచ్చానని చెప్పడానికి నోరు పెగల్లేదా నీకు? యింత నోరులేని మూగజీవానివి గుమస్తాగా నువ్వేం పనికొస్తావ్? హు వెళ్ళు యీ పక్కనే నీరూమ్. వెళ్లి ఎకౌంట్ ఫైల్ తీసుకురా? యిహనుండీ నోట్లోమాట నోట్లో వుంచుకుని గొర్రెలా తలూపావంటే వూరుకొనేది లేదు మెమో యివ్వగలను జాగ్రత్త......."

—— రాజ్

FREE !! **ఉచితం !!**

# పరీక్ష

క్రీస్తు ప్రభువునుగూర్చి తెలుసుకొని తన మనసు మార్చుకున్నాడు కమ్మరి కాంతయ్య. ఎంతో మంచివాడుగ ఎనిమిది సంవత్సరములనుండి జీవిస్తున్న కాంతయ్య బ్రతుకును చూస్తున్న పాపయ్య అనే నాస్తికుడు కాంతయ్యను ప్రశ్నించాడు—"కాంతయ్యా నీవు క్రీస్తునందు విశ్వాసముంచిన దగ్గరనుండి నిన్ను ఒక కంట కనిపెట్టుతున్నాను. నీవు నిజంగా సత్యమార్గంలోనే నడుస్తున్నావు. అందరినీ ప్రేమించి, వారి కష్టాల్లో తృణమో, పణమో ఇచ్చి తోడ్పడుతున్నావు. అయితే మునుపటికన్నా కష్టాలు, ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. అందని ఆనందాన్ని అన్వేషిస్తూ అర్థంలేని ఆదర్శంకోసం నీ జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నావేమో! దేవునికి మన జీవితాలను అప్పగించినవెంటనే మన కష్టాలు అంతమవ్వాలిగాని, నీకేమో అవి ఎక్కువవుతున్నాయి." కాంతయ్య కళ్ళు కొంతసేపు మెరుపులు చిమ్మాయి. మరుక్షణం ఆముఖం ఆలోచనలతో నిండిపోయింది. "చూడు పాపయ్యా! నా చేతిలోనున్న ఈ ఇనుప ముక్క బండికి అమర్చవలసిన ఒక స్ప్రింగు. దీనిని ఎర్రని అగ్నిలో కాల్చి చల్లనినీటిలోముంచి అటుపిమ్మట సుత్తితో సాగదీసి, నడుమకి వంచి స్వరూపం మార్చి పదును చెయ్యాలి. అప్పుడే అది పనికివస్తుంది. దీనిని సాగదీసే ప్రయత్నంలో ఇది పెళుసుగానుండి విరిగిపోతే దీనిని పాతఇనుములో పడవేస్తాం. పాతఇనుము ఖరీదు కిలో రూపాయి అయితే ఈస్ప్రింగు ఎంతో విలువైనది. దీనిమీద వందలాది రూపాయలు సంపాదించవచ్చు. అలాగే దేవుడుకూడా మనలను క్రీస్తు స్వరూపములో మలచుటకు ఈ కష్టాలను, కన్నీళ్ళను పంపుతుంటాడు. ఆ దేవుడు మనమీద అగ్నిలాంటి శ్రమలను పంపి మనలను సాగదీసినప్పుడు మన స్వరూపములను మార్చుకొనక పెళుసుగా వున్నట్లయితే పాత ఇనుమువలె పారవేస్తాడు. ఇంక దానికి అట్టే విలువ ఉండదు. అయనచేతిలో మన స్వరూపం మార్చుకొనగలిగితే తన విలువైన సేవలో మనల్ని వాడుకుంటాడు. పాలరాయిలో ఇమిడియున్న శిల్పసుందరిని శిల్పిమలచినప్పుడు దాని విలువ పెరుగుతుందిగాని వట్టిముడిరాయికి ఏమంత విలువ ఉంటుంది? కష్టాలు, కన్నీళ్లు, బాధలు దేవుడు మనల్ని దైవస్వరూపములో తీర్చిదిద్దుటకు ఇచ్చే వ్యాయామం."

"అయన నన్ను శోధించిన తరువాత నేను సువర్ణమువలె కనబడుదును" అని దైవాజ్ఞాను సారముగా శోధింపబడిన భక్తుడొకడు పలుకుతున్నాడు. శోధనలో, బాధలలో పడిపోకుండ స్థిరంగా నిలిచే దైవశక్తికోసం ఈనాడే క్రీస్తు ప్రభువును గూర్చి తెలుసుకొనుడి.

—చదలవాడ చంద్రమతీదేవి


**ఉచితం :** **ఉచితం :**

మీకు బైబిల్‌కుసంబంధించిన ఉచితంగా లభించే అందమైన పుస్తకాలు కావాలనుకుంటే, ఒకపోస్టు కార్డుమీద మీ అడ్రసను స్పష్టంగా వ్రాసి మాకు పంపండి. పోస్టుఖర్చులుకూడా మేమే భరించి మీకు ఉచితంగా పుస్తకం పంపుతాము.

డా॥ ఎస్. జాన్ డేవిడ్, డి డి, D.D,
ఫార్‌కార్నర్స్
పోస్టుబాక్సు 14, చిలకలూరిపేట
గుంటూరు జిల్లా.

GOSPEL MESSAGE INSERTED BY FAR CORNERS